# అత్యవసర సమయంలో రక్తదానం

## మానవత్వం చాటుకున్న కాంగ్రెస్ కార్యకర్త



**నేటి సాక్షి,ఆసిఫాబాద్(ఎండి ముబీన్):** ఆసిఫాబాద్ మున్సిపాలిటీ 12వ వార్డుకు చెందిన కాంగ్రెస్ కార్యకర్త షేక్ షాబాజ్ హుస్సేన్ రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. కాగజ్‌నగర్‌కు చెందిన ఓ మహిళ రక్తహీనతతో బాధపడుతూ ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఆమెకు అత్యవసరంగా రక్తం కావాలని వైద్యులు సూచించగా, విషయం తెలుసుకున్న షాబాజ్ హుస్సేన్ వెంటనే స్పందించి ఆసుపత్రికి చేరుకున్నారు. మహిళకు అవసరమైన రక్తాన్ని అందజేసి ఆమె ప్రాణాపాయం నుంచి బయటపడేందుకు సహకరించారు. సకాలంలో స్పందించి ప్రాణదాతగా నిలిచిన షాబాజ్ హుస్సేన్‌కు మహిళా కుటుంబ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఆపదలో ఉన్న వారికి అండగా నిలిచిన ఆయన సేవా భావాన్ని స్థానిక ప్రజలు మరియు పార్టీ నాయకులు ప్రత్యేకంగా అభినందించారు. సమాజంలో ఇటువంటి సేవా కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఈ సందర్భంగా పలువురు ఆకాంక్షించారు.

# మరికల్ ఏఎస్ఐగా మహమ్మద్ గఫూర్



**నేటి సాక్షి,మరికల్,నారాయణపేట(ఇమామ్ సాబ్):** నారాయణపేట జిల్లా మరికల్ మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్లో అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ASI)గా మహమ్మద్ గఫూర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన మహబూబ్‌నగర్ జిల్లాలోని దేవరకద్ర మండల పోలీస్ స్టేషన్లో ఏఎస్ఐగా విధులు నిర్వహించారు. బదిలీపై మరికల్ పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఆయన, ఇక్కడ బాధ్యతలు స్వీకరించిన అనంతరం సిబ్బందితో మాట్లాడారు. మండల పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు, నేరాల నియంత్రణకు తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన గఫూర్‌ను పోలీస్ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు.

# కొనుగోలు కేంద్రాల్లో సదుపాయాలు కల్పించాలి

## బీజేపీ నాయకులు మామిడిపల్లి ప్రసాద్



**నేటి సాక్షి, ఎండపల్లి:** తెలంగాణ రాష్ట్రంలో తీవ్ర వడగాలులు, పెరుగుతున్న ఉష్ణోగ్రతల నేపథ్యంలో వరి ధాన్యం సేకరణ ప్రక్రియలో రైతులు ఇబ్బందులు పడకుండా కొనుగోలు కేంద్రాల్లో సరైన సదుపాయాలు కల్పించాలని ఎండపల్లి మండల బీజేపీ నాయకులు మామిడిపల్లి ప్రసాద్ ప్రభుత్వాన్ని కోరారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు నిలువ నీడ కల్పించేందుకు తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేయాలని, తగినంత టార్పాలిన్ కవర్లు, గన్నీ సంచులు అందుబాటులో ఉంచాలని సూచించారు. వడదెబ్బకు గురికాకుండా రైతులు, హమాలీల కోసం చల్లని తాగునీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ పాకెట్లు అందించేలా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఎండల తీవ్రత దృష్ట్యా ధాన్యం తూకం ప్రక్రియను ఉదయం 11 గంటల లోపు, సాయంత్రం 4 గంటల తర్వాత నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ఎక్కువసేపు వేచి చూడకుండా టోకెన్ విధానాన్ని పారదర్శకంగా అమలు చేయాలని అన్నారు. అత్యవసర పరిస్థితుల్లో వడదెబ్బకు గురైన రైతులకు తక్షణ ప్రాథమిక చికిత్స అందించేందుకు వైద్య సిబ్బందిని సిద్ధంగా ఉంచేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మామిడిపల్లి ప్రసాద్ విజ్ఞప్తి చేశారు.

# నేడు విద్యుత్ అంతరాయం

## రాజారాంపల్లి సెక్షన్ పరిధిలో మరమ్మత్తులు



**నేటి సాక్షి, ఎండపల్లి:** మండల పరిధిలోని పాతగూడూరు, గుల్లకోట విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మత్తుల దృష్ట్యా నేడు (ఏప్రిల్ 18, శనివారం) విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా నిలిపివేయనున్నట్లు ఏఈ బండి సమ్మయ్య ప్రకటన ద్వారా తెలిపారు. గుల్లకోట, చర్లపల్లి, కొండాపూర్ గ్రామాల్లో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని పేర్కొన్నారు. అదే విధంగా పాతగూడూరు, సూరారం, రాజారాంపల్లి గ్రామాల్లో మధ్యాహ్నం 1 గంట నుండి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు. మరమ్మత్తుల పనులు సజావుగా కొనసాగేందుకు గ్రామాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని విద్యుత్ శాఖ రాజారాంపల్లి సెక్షన్ తరఫున ఏఈ విజ్ఞప్తి చేశారు.

# పీఆర్సీని వెంటనే ప్రకటించాలి

- నల్ల బ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన



**నేటి సాక్షి నారాయణపేట(ఇమామ్ సాబ్):** ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని మరియు నూతన పీఆర్సీని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేస్తూ టీజీఈ జేఏసీ పిలుపు మేరకు శుక్రవారం నారాయణపేట జిల్లాలో నిరసనలు మిన్నంటాయి. జాజాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే పీఆర్సీ నివేదికను తెప్పించుకుని, 51 శాతం ఫిట్‌మెంట్‌తో అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న అన్ని బకాయిలను ఏకమొత్తంగా చెల్లించాలని, ఉద్యోగుల ఆరోగ్య భద్రత కోసం నూతన ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్‌ను అమలు చేయాలని కోరారు. అలాగే కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (జూూ)ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని (ూూ) పునరుద్ధరించాలని నినదించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు భారతి, ఉపాధ్యాయులు మధుసూదన్, భాను ప్రకాష్, మంగళ లక్ష్మణ్, నిర్మల, శిరీష, శశిరేఖ, ప్రతాప్, నరసింహ రఘురాం రెడ్డి పాల్గొన్నారు. అలాగే ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం అనురాధ, రజిత, సాయి కృష్ణ, మాణిక్యప్ప, నారాయణ తదితరులు పాల్గొని మద్దతు తెలిపారు.

# రోడ్డుకు అడ్డంగా 'డబ్బా'.. పట్టించుకోని పంచాయతీ అధికారులు

- నెల రోజులుగా ఫిర్యాదు చేసినా ఫలితం లేదన్న అప్పంపల్లి యువత
- నిర్లక్ష్యం వహిస్తే ఆందోళన తప్పదని హెచ్చరిక.. త్వరలోనే తొలగిస్తామన్న కార్యదర్శి





**నేటి సాక్షి,మరికల్,నారాయణపేట (ఇమామ్ సాబ్):** నారాయణపేట జిల్లా మరికల్ మండల పరిధిలోని అప్పంపల్లి గ్రామంలో రహదారిపై అడ్డంగా ఉన్న డబ్బాను వెంటనే తొలగించాలని గ్రామ యువకులు డిమాండ్ చేశారు. శుక్రవారం అప్పంపల్లి గ్రామానికి చెందిన యువకులు శశివర్ధన్ రెడ్డి, మధుసూదన్, రాజన్న స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. గ్రామంలోని స్వామి వివేకానంద చౌరస్తాలో రోడ్డుకు అడ్డంగా వేసిన డబ్బా వల్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై గత నెల రోజుల క్రితమే గ్రామ పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం సమర్పించినా ఎటువంటి చర్యలు తీసుకోలేదని వారు ఆరోపించారు. మండల స్థాయి అధికారులు ఈ విషయంపై తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని యువకులు హెచ్చరించారు. ఈ విషయమై గ్రామ పంచాయతీ కార్యదర్శి జ్యోతిని వివరణ కోరగా.. వివేకానంద చౌరస్తాలో రోడ్డుకు అడ్డంగా ఉన్న డబ్బాను తొలగించాలని ఇప్పటికే సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేశామని తెలిపారు. త్వరలోనే ఆ డబ్బాను తొలగించి రహదారిని పునరుద్ధరిస్తామని ఆమె వివరించారు.

# ఉద్యోగుల ఓపికకు పరీక్ష వద్దు

- డిమాండ్లు నెరవేర్చకుంటే ఉద్యమం తప్పదు
- పీఆర్సీ, డీఏలను వెంటనే విడుదల చేయాలని ఉద్యోగ సంఘాల డిమాండ్
- గజ్వేల్‌లో ఐఓసీ కార్యాలయం ముందు నిరసన.. తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేత




**నేటి సాక్షి,గజ్వేల్ :** ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఉద్యోగ సంఘాల నేతలు హెచ్చరించారు. రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు సిద్దిపేట జిల్లా జేఏసీ చైర్మన్ గ్యాదరి పరమేశ్వర్ ఆదేశాలతో, టీఎన్జీఓ (TNGO.S) గజ్వేల్ తాలూకా కార్యదర్శి రాజశేఖరరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం గజ్వేల్ ఐఓసీ (ూజ) కార్యాలయం ముందు ఉద్యోగులు భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. ఉద్యోగులకు రావాల్సిన 2వ పీఆర్సీని వెంటనే అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను, ఇతర బిల్లులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ ఉద్యోగులకు అందాల్సిన పెన్షన్, గ్రాట్యుటీ బెనిఫిట్స్‌లో జాప్యం చేయడం సరికాదని మండిపడ్డారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని, హెల్త్ కార్డుల ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు. అనంతరం తహశీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీఎన్జీఓ వైస్ ప్రెసిడెంట్ నాగభూషణం, వెంకట్, మహిళా విభాగం ప్రతినిధి జబీనా సుల్తానా, ట్రెజరర్ ప్రవీణ్ పాల్గొన్నారు. పెన్షనర్ల సంఘం నాయకులు రాజేష్, నాగేశ్వరరావు, రామకృష్ణ రెడ్డితో పాటు ఉపాధ్యాయ సంఘాల నేతలు సత్యనారాయణ రెడ్డి, లింగం (PRTU), వలీ అహ్మద్, సత్యనారాయణ (UTF), శ్రీనివాస్ (TPTF), సీపీఎస్ రాష్ట్ర నాయకులు మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

# పోషణ పక్వాడాతో ఆరోగ్యవంతమైన బాల్యం

- అంగన్వాడిలో అన్నప్రాసన.. సర్పంచ్ లావణ్య సూచన



**నేటి సాక్షి, ఎండపల్లి:** మండలంలోని చర్లపల్లి గ్రామ అంగన్వాడి కేంద్రంలో పోషణ పక్వాడా కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఐసిడిఎస్, అంగన్వాడి ఉపాధ్యాయురాలు కడారి పద్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. ఇందులో భాగంగా చిన్నారుల తల్లిదండ్రులకు సమతుల్య ఆహారం, పోషకాహారం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ పడిదం లావణ్య మాట్లాడుతూ చిన్నారుల శారీరక, మానసిక అభివృద్ధికి సరైన పోషకాహారం ఎంతో కీలకమని తెలిపారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా అనారోగ్య సమస్యలను దూరం చేసుకోవచ్చున్నారు. ప్రభుత్వం చేపట్టిన పోషణ పక్వాడా కార్యక్రమం ప్రతి కుటుంబానికి ఉపయోగకరమని, గ్రామస్థులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే చిన్నారులకు సమయానికి టీకాలు వేయించడం, శుభ్రత పాటించడం, పౌష్టికాహారం తీసుకోవడం వంటి అంశాలపై అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. అంగన్వాడి కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అల్లం తిరుపతి, ఐసిడిఎస్ సూపర్వైజర్ ఆండాలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యం, ఆశా వర్కర్లు పడిదం లత, జంజుపెల్లి రజిత, మహిళలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# ఉద్యోగులు, పెన్షనర్ల పెండింగ్ సమస్యల పరిష్కారానికి దశల వారీ ఉద్యమం




**నేటి సాక్షి,కరీంనగర్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని ఉద్యోగ సంఘాల నేతలు మండిపడ్డారు. శుక్రవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. భోజన విరామ సమయంలో నల్ల రిబ్బన్లు ధరించి ప్రభుత్వ నిరంకుశ వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు మహమ్మద్ ఉస్మాన్ పాషా, ప్రధాన కార్యదర్శి జాలి మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. అధికారంలోకి రాకముందు నెల రోజుల్లోనే పీఆర్సీ ఇస్తామని, పెండింగ్ డీఏలను క్లియర్ చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడుస్తున్నా గత ప్రభుత్వాన్ని నిందించడమే తప్ప చేసిందేమీ లేదని విమర్శించారు. ముఖ్యంగా మార్చి 2024 నుండి పదవీ విరమణ పొందిన పెన్షనర్ల పరిస్థితి వర్ణనాతీతంగా మారిందని, వారికి రావలసిన బెనిఫిట్స్ అందక తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో మనోవేదనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెన్షన్ బెనిఫిట్స్ విషయంలో హైకోర్టు ప్రభుత్వానికి మొట్టికాయలు వేయడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పీఆర్సీ, డీఏలు మరియు పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఫైనాన్స్ సెక్రటరీ పోలాస రామచంద్రం, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు పెరుక నాగమోహన్, రాష్ట్ర కార్యదర్శి మనోహర్ కుమార్ గౌడ్, ఏ శ్రీధర్ రావు, రవీందర్ రాజు, లచ్చిరెడ్డి, సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీని ప్రైవేటుపరం చేసే కుట్రలు ఆపాలి



- గజ్వేల్ ప్రజ్ఞాపూర్ డిపో ముందు ఆర్టీసీ కార్మికుల గ్రేట్ మీటింగ్
- హామీలు నెరవేర్చకపోతే ఈ నెల 22న బంద్ - ప్రభుత్వానికి జేఏసీ హెచ్చరిక

**నేటి సాక్షి గజ్వేల్:** ఆర్టీసీని కనుమరుగు చేసి ప్రైవేటుపరం చేసే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపిస్తూ సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ డిపో ముందు ఆర్టీసీ కార్మికులు భారీగా గ్రేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్టీసీ కార్మికుల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ మౌలానా,, రాష్ట్ర కోశాధికారి యాదన్న నాయకులు జక్కుల నర్సిములు, డిపో జేఏసీ కన్వీనర్ రాజయ్య పాల్గొని ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకాన్ని ఆర్టీసీ కార్మికులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటూ విజయవంతంగా అమలు చేస్తూ ప్రభుత్వానికి మంచి పేరు తీసుకువస్తున్నారని తెలిపారు. అయితే ఈ పథకం అమలుతో డ్రైవర్లు, కండక్టర్లపై పని ఒత్తిడి విపరీతంగా పెరిగిందని, రద్దీ బస్సుల్లో ప్రయాణికుల రద్దీ కారణంగా అనుకోకుండా చిన్న చిన్న తప్పిదాలు జరిగితే కార్మికులను ఉద్యోగాల నుంచి తొలగించడం అన్యాయమని వారు మండిపడ్డారు.

అలాగే ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన ప్రభుత్వం ఆర్టీసీకి చెందిన విలువైన భూములు, ఆస్తులు, వర్క్‌షాపులు, డిపోలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన ఆరు హామీలను అమలు చేయకుండా ఆర్టీసీని ప్రైవేటుపరం చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఆలోచిస్తోందని విమర్శించారు. ఆర్టీసీ సంస్థను ప్రభుత్వంలో విలీనం చేసి కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, అన్ని ప్రభుత్వ శాఖల మాదిరిగానే ఆర్టీసీ కార్మికులకు ఉద్యోగ భద్రత, వేతన సవరణ, సౌకర్యాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. కార్మికుల సంక్షేమాన్ని కాపాడాల్సిన ప్రభుత్వం సమ్మె నిషేధం పేరుతో కార్మికులను బెదిరింపులకు గురిచేస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ బెదిరింపులకు ఆర్టీసీ కార్మికులు భయపడబోరని జేఏసీ నాయకులు స్పష్టం చేశారు. తమ హక్కుల కోసం, ఆర్టీసీ ఆస్తులను కాపాడుకునేందుకు పోరాటం తప్పదని ప్రకటించారు. 22న ఆర్టీసీ బంద్‌కు ప్రజలు సహకరించాలి ఆర్టీసీ ఆస్తులను కాపాడుకుంటూ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని హెచ్చరిస్తూ ఈ నెల 22న చేపట్టనున్న ఆర్టీసీ బందును విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. తమ డిమాండ్లు నెరవేర్చినప్పుడే ఆర్టీసీ బస్సు చక్రాలు తిరుగుతాయని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని జేఏసీ నాయకులు హెచ్చరించారు. ప్రజలు కూడా ఆర్టీసీ కార్మికుల ఉద్యమానికి మద్దతుగా నిలబడి బందుకు సహకరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ జేఏసీ నాయకులు నర్సింలు అంబాదాస్, పద్మ, కరీముద్దీన్, సిద్ధ రాములు, మహేష్, గఫూర్, శ్యామ్ సుందర్, శంకర్‌లతో పాటు పెద్ద సంఖ్యలో ఆర్టీసీ కార్మికులు, జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత





**నేటి సాక్షి,వికారాబాద్ :** రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ బాధ్యతగా వ్యవహరించాలని రాష్ట్ర అదనపు డీజీపీ స్వాతి లక్రా పిలుపునిచ్చారు. 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా శుక్రవారం వికారాబాద్‌లోని శ్రీసాయి దంత వైద్య కళాశాలలో నిర్వహించిన "అరైవ్ అలైవ్" అవగాహన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ, ఎస్పీ స్నేహ మెహ్రాతో కలిసి ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వాతి లక్రా మాట్లాడుతూ.. అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్లే రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించకపోవడం వల్ల విలువైన ప్రాణాలు కోల్పోతున్నారని, యువత సోషల్ మీడియా ద్వారా రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. కలెక్టర్ దీపక్ తివారీ మాట్లాడుతూ.. గమ్యం కంటే ప్రాణం ముఖ్యమని, డ్రైవింగ్ విషయంలో జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలను అరికట్టవచ్చని తెలిపారు. జిల్లాలో ప్రతి నెలా రోడ్డు భద్రత కమిటీ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎస్పీ స్నేహ మెహ్రా మాట్లాడుతూ.. వాహనదారులకు కంటి చూపు స్పష్టంగా ఉండటం అవసరమని, అందుకే డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి అద్దాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన డ్రగ్స్ వ్యతిరేక నాటకాలు, రోడ్డు భద్రత లఘు చిత్రాలు అందరినీ ఆలోచింపజేశాయి. అనంతరం అత్యవసర సేవలు అందించిన 108 సిబ్బంది పవన్ కుమార్, వైద్యులు డాక్టర్ సౌమ్య, డాక్టర్ రోహిత్, పోలీస్ కళాజాత బృందాన్ని అతిథులు శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రాములు నాయక్, వైస్ ప్రిన్సిపాల్ సంపత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## అరైవ్ ఆలైవ్ రోడ్డు భద్రత కార్యక్రమం



**నేటిసాక్షి, తిరుమలయపాలెం (రుద్రరాజు):** అరైవ్ ఆలైవ్ రోడ్డు భద్రత వారోత్సవాల భాగంగా ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం కొక్కిరేణి క్రాస్ రోడ్డు వద్ద ఎస్సై కూచిపూడి జగదీష్ ,డాక్టర్ రాజకుమార్ ఆధ్వర్యంలో ప్రయాణికులకు, ఆటో డ్రైవర్లకు ప్రమాదం జరిగినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. ప్రయాణాలు చేస్తున్నప్పుడు ప్రమాదవశాత్తు యాక్సిడెంట్ అయితే ముందుగా 108 కాల్ చేసిన తర్వాత గాయపడిన వారికి ప్రథమ చికిత్స అందించే విధానం ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తికి గుండె పునరుద్ధరణ (సిపిఆర్) పద్ధతులు ఎలా చేయాలో వివరించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలని.. అతివేగం ప్రాణాలకు ప్రమాదకరమని ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లకు, ప్రయాణికులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ప్రయాణికులు ఆటో డ్రైవర్లు, అంబులెన్స్ డ్రైవర్లు పాల్గొన్నారు.

# పిల్లల ఎదుగుదలకు పోషకాహారం

## సూర్యాపేట జిల్లా సంక్షేమ అధికారి నరసింహారావు



**నేటి సాక్షి, మునగాల:** చిన్నపిల్లల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు సమతుల పోషకాహారం అత్యంత అవసరమని జిల్లా సంక్షేమ అధికారి నరసింహారావు పేర్కొన్నారు. మునగాల మండల పరిధిలోని నరసింహుల గూడెం గ్రామంలో అంగన్వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో కోడాడ. ప్రాజెక్టు మాధవరం సెక్టార్ నిర్వహించిన పోషక పక్కవాడ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. పిల్లల శారీరక, మానసిక అభివృద్ధికి తగిన పోషకాహారం అందించడంలో తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకమని ఆయన వివరించారు. ముఖ్యంగా గర్భిణీ స్త్రీలు, బాలింతలు, ఐదేళ్ల లోపు చిన్నారులు సరైన పోషకాహారం తీసుకోవడం ద్వారా అనారోగ్య సమస్యలను దూరం చేసుకోవచ్చని సూచించారు. ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహార సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, పిల్లల ఆరోగ్యంపై నిరంతరం పర్యవేక్షణ అవసరమని పేర్కొన్నారు. చిన్నపిల్లలలో పోషకాహార లోపం వల్ల వచ్చే సమస్యలను ముందుగానే గుర్తించి నివారించేందుకు తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అంగన్వాడీ టీచర్లు గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ, ప్రతి ఇంటికీ వెళ్లి పిల్లల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించాలని ఆదేశించారు. పిల్లలకు గుడ్లు, పాలు, పండ్లు, ఆకుకూరలు వంటి పోషకాహారం తప్పనిసరిగా అందించాలని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న తల్లులు, మహిళలకు ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై ప్రత్యేక అవగాహన కల్పించారు. ఇంటి వద్దే లభించే ఆహార పదార్థాలతో పోషకాహారం తయారు చేసుకునే విధానాలను వివరించారు. ముఖ్యంగా పిల్లల ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం చేయకుండా ప్రభుత్వం అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలని అధికారులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎక్స్టెన్షన్ అధికారి స్వర్ణలత అంగన్వాడీ టీచర్లు సృజన రాణి, అరుణ, జయమ్మ, ఆయాలు పాల్గొన్నారు.

# మైలారం ఆలయంలో ప్రసాద వితరణ



**నేటి సాక్షి,గన్నేరువరం(బుర్ర అంజయ్య గౌడ్):** మండలంలోని మైలారం గ్రామంలో వెలసిన శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థానంలో గురువారం తోట హిమబిందు శేఖర్ దంపతులు భక్తులకు పులిహోర ప్రసాద వితరణ చేశారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తుల సౌకర్యార్థం వారు ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా దేవస్థానం చైర్మన్ వారాల పరుశురాం మాట్లాడుతూ.. నిత్యం భక్తులతో కళకళలాడే మల్లికార్జున స్వామి ఆలయంలో ప్రసాద వితరణ చేయడం అభినందనీయమన్నారు. తోట హిమబిందు శేఖర్ దంపతులకు, వారి కుటుంబ సభ్యులకు ఆ మల్లికార్జున స్వామి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి




**నేటి సాక్షి:** కోసిగి మండల పరిధిలోని ప్రధాన రహదారులపై జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు తక్షణ రక్షణ చర్యలు చేపట్టాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ నాయకులు స్థానిక సబ్ ఇన్స్పెక్టర్ రమేష్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఈరేష్, మండల కార్యదర్శి అంజి మాట్లాడుతూ, మండలంలోని ప్రధాన రహదారులపై వాహనాల రద్దీ అధికమైందని, అతివేగం కారణంగా ప్రజలు, ముఖ్యంగా విద్యార్థులు ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. ప్రమాదకర మలుపులు, పాఠశాలల వద్ద హెచ్చరిక బోర్డులు లేకపోవడం, స్పీడ్ బ్రేకర్లు లేకపోవడం ప్రమాదాలకు దారితీస్తోందని ఆరోపించారు. రోడ్డు నిర్మాణ బాధ్యత వహిస్తున్న ఆర్అండ్‌బీ అధికారులు సరైన భద్రతా చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. ప్రమాదాలను తగ్గించేందుకు ప్రధాన కూడళ్ల వద్ద స్పీడ్ బ్రేకర్లు, బారికేడ్లు ఏర్పాటు చేయాలని, రాత్రి వేళల్లో మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై, అతివేగంగా వెళ్లే వారిపై ప్రత్యేక నిఘా ఉంచి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇటీవల మంత్రాలయం మండలం చిలకలడోన గ్రామ సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఎనిమిది మంది అక్కడికక్కడే మృతి చెందడం తీవ్రంగా కలచివేసిందని పేర్కొంటూ, మృతుల కుటుంబాలకు ఏఐఎస్ఎఫ్ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసింది. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తక్షణమే పరిహారం ప్రకటించాలని కోరింది. ప్రజల ప్రాణాలను దృష్టిలో ఉంచుకుని పోలీసు శాఖ వెంటనే స్పందించి తగిన చర్యలు చేపట్టాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో హనుమంతు, రాజు, కోసిగయ్య, వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి కూలీలకు రూ.600 వేతనం ఇవ్వాలి



**నేటి సాక్షి,మునగాల:** గ్రామీణ ప్రాంతాల్లో పెరిగిన జీవన వ్యయానికి అనుగుణంగా ఉపాధి హామీ కూలీల కనీస వేతనాన్ని రోజుకు రూ. 600లకు పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం సూర్యాపేట జిల్లా అధ్యక్షులు ములకలపల్లి రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మునగాల మండలంలోని కోదండరామపురం గ్రామంలో ఉపాధి హామీ పని ప్రదేశాన్ని ఆయన సందర్శించి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ.. ప్రస్తుతం అందుతున్న వేతనాలు కూలీల కుటుంబ పోషణకు, వైద్య, విద్య ఖర్చులకు ఏమాత్రం సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్కువ వేతనం కారణంగా కూలీలు అప్పుల బారిన పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి వేతనం పెంచడంతో పాటు పనిదినాలను కూడా పెంచాలని కోరారు. పనుల కల్పనలో లోపాలు, వేతనాల చెల్లింపుల్లో జరుగుతున్న ఆలస్యాన్ని నివారించి కూలీలకు ఉపాధి భద్రత కల్పించాలన్నారు. లేనిపక్షంలో కూలీల పక్షాన పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు సోమపంగు జానయ్య, ఆరే రామకృష్ణారెడ్డి, వెంకటేశ్వర్లు మరియు పెద్ద సంఖ్యలో కూలీలు పాల్గొన్నారు.

# మల్లన్న సాగర్ నిర్వాసితుల విజయం

## మంత్రి దామోదర్ రాజనర్సింహకు కృతజ్ఞతలు



**నేటి సాక్షి,గజ్వేల్ :** మల్లన్న సాగర్ భూనిర్వాసితుల సుదీర్ఘ పోరాటానికి ఎట్టకేలకు న్యాయం దక్కింది. 2019లో మంత్రి దామోదర్ రాజనర్సింహ నాయకత్వంలో న్యాయస్థానాన్ని ఆశ్రయించిన నిర్వాసితులకు, ఏడేళ్ల తర్వాత అనుకూల తీర్పు రావడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఈ సందర్భంగా వివిధ గ్రామాల నుంచి వచ్చిన ఒంటరి మహిళలు మంత్రి దామోదర్ రాజనర్సింహను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో నిర్వాసితుల పక్షాన నిలబడి, ఎన్ని అవమానాలు ఎదురైనా వెనకడుగు వేయకుండా ఆయన చేసిన పోరాటం వల్లే నేడు విజయం లభించిందని వారు ఆనందం వ్యక్తం చేశారు. "కేసు వేస్తే ఏమీ రావు" అని హేళన చేసిన వారికి ఈ తీర్పు గట్టి సమాధానమని మహిళలు పేర్కొన్నారు. కొందరు వ్యక్తులు కావాలనే తప్పుడు ప్రచారంతో ప్రజలను గందరగోళానికి గురిచేసి, కొత్త కేసులు వేయించి న్యాయ ప్రక్రియను అడ్డుకున్నారని వారు ఆరోపించారు. దీనివల్ల ఒంటరి మహిళలు భయాందోళనకు గురయ్యారని, అడ్డంకులు సృష్టించిన వారే అసలైన ద్రోహులని విమర్శించారు. భూములు, ఇళ్ల సమస్యలపై ఇంకా కోర్టు కేసుల్లో ఉన్నవారు లేదా ఇప్పటివరకు ఆశ్రయించని వారు ఎవరూ అధైర్యపడొద్దని, అందరికీ న్యాయం జరుగుతుందని ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు. ఈ విజయం మల్లన్న సాగర్ నిర్వాసితుల్లో కొత్త ఆశలు చిగురింపజేసిందని వారు వెల్లడించారు.

# తెలంగాణ చరిత్రను వక్రీకరించొద్దు

## తేజస్వి సూర్యపై కొప్పుల ఫైర్




**నేటి సాక్షి,ఎండపల్లి :** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై కర్ణాటక బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలపై మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ త్యాగాల చరిత్రను వక్రీకరించడం సరికాదని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తేజస్వి సూర్య వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. దేశ విభజనతో తెలంగాణ ఏర్పాటును పోల్చడం తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనని మండిపడ్డారు. 60 ఏళ్ల సుదీర్ఘ పోరాటం, 1200 మంది అమరుల బలిదానాలు మరియు కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష ఫలితంగానే ప్రత్యేక రాష్ట్రం సిద్ధించిందని ఆయన గుర్తు చేశారు. 14 ఏళ్ల పాటు నిరంతర ఉద్యమాన్ని నడిపి, అన్ని రాజకీయ పార్టీలను ఒప్పించి సాధించుకున్న తెలంగాణను.. భారత్–పాకిస్థాన్ విభజనతో పోల్చడం అజ్ఞానానికి నిదర్శనమని విమర్శించారు. ఇటువంటి వ్యాఖ్యలు తెలంగాణ అస్తిత్వంపై దాడి చేయడమేనని, త్యాగాల చరిత్రను అవమానించినందుకు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

# దొంతన్‌పల్లిలో అంబేద్కర్ యువజన సంఘం ఏర్పాటు



- నూతన కమిటీ నిర్మాణానికి రేపు గ్రామసభ
- అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు, యువజన సంఘ భవన నిర్మాణం లక్ష్యంగా కార్యాచరణ.. ఈనెల 30న జాతరకు సన్నద్ధత

**నేటి సాక్షి,శంకర్‌పల్లి(సుధాకర్ గౌడ్):** శంకర్పల్లి మండలంలోని పల్లి గ్రామం అన్ని గ్రామాలు అభివృద్ధి బాటలో ముందుకెళ్తుంటే, బాబాసాహెబ్ అంబేద్కర్ భావజాలాన్ని గ్రామస్థాయిలో బలంగా ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని దొంతన్‌పల్లి గ్రామ యువత భావిస్తోంది. అయితే గ్రామంలో ఇప్పటివరకు బాబాసాహెబ్ అంబేద్కర్ యువజన సంఘం లేకపోవడం బాధాకరమని పేర్కొంటూ, దీనిపై సమిష్టిగా చర్యలు చేపట్టేందుకు యువకులు ముందుకు వచ్చారు. గత రాత్రి గ్రామంలోని యువతీ యువకులతో సమావేశం నిర్వహించి అంబేద్కర్ సంఘం ఏర్పాటు దిశగా చర్చలు జరిపారు. ఈ సందర్భంగా గ్రామంలో అంబేద్కర్ భావజాలాన్ని విస్తరించడంతో పాటు యువతకు విద్యా, సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా దిశానిర్దేశం చేయాలన్న లక్ష్యంతో సంఘాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. రేపు ఉదయం 7 గంటలకు గ్రామంలోని సభ్యులందరితో కలిసి నూతన కమిటీ నిర్మాణానికి సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కమిటీ ద్వారా మహనీయుల ఉత్సవాల కమిటీని ఏర్పాటు చేసి, తద్వారా గ్రామంలో బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు కోసం కార్యాచరణ సిద్ధం చేయనున్నట్లు వెల్లడించారు. అలాగే స్థానిక ఎమ్మెల్యే సహకారంతో అంబేద్కర్ యువజన సంఘం భవన నిర్మాణానికి సంపూర్ణ సహకారం అందిస్తామని, గ్రామంలో చదువుతున్న విద్యార్థులు, యువతీ యువకులకు ఈ కమిటీ అండగా నిలిచి జ్ఞాన మార్గంలో ముందుకు నడిపించేందుకు కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఈనెల 30వ తేదీన జరగబోయే అంబేద్కర్ జాతరకు గ్రామమంతా సన్నద్ధంగా ఉండాలని సమావేశంలో పిలుపునిచ్చారు.

# వాగ్దేవి వొకేషనల్ విద్యార్థుల ప్రభంజనం

- రాష్ట్ర స్థాయి మార్కులు సాధించిన విద్యార్థులు
- అభినందించిన కళాశాల కరెస్పాండ్ అనిల్, ప్రిన్సిపాల్ రమేష్ చంద్ర.

**నేటి సాక్షి,కమలాపూర్:** హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం అంబాల లోని వాగ్దేవి వొకేషనల్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాలలో రాష్ట్ర స్థాయి మార్కులు సాధించి ప్రతిభను కనబరిచారు. ఉత్తమ ఫలితాలను సాధించిన సందర్భంగా విద్యార్థులను కళాశాల కరెస్పాండెంట్ సూరిశెట్టి అనిల్,ప్రిన్సిపాల్ రమేష్ చంద్ర ప్రసాద్ మరియు అధ్యాపక బృందం అభినందించారు. కళాశాల కరెస్పాండెంట్ సూరిశెట్టి అనిల్ మాట్లాడుతూ పేద మధ్య తరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నామని తెలియజేసారు. విద్యార్థుల భవిష్యత్తుకి బాటలు వేస్తున కళాశాల అధ్యాపకులను ప్రశంసించారు. కళాశాల ప్రిన్సిపాల్ రమేష్ చంద్ర ప్రసాద్ కళాశాల ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థుల వివరాలు తెలియజేయడం జరిగింది.ఫస్ట్ ఇయర్ లో కూడికల



హారిక 493,శృతి 418, సింధుప్రియ404, భూమిక 404, ప్రియాంక 397, మెహర్ ఉన్నీస 386, మనస 354సెకండ్ ఇయర్‌లో చందన 924,సౌజన్య 916, శరీష్మ904, సారిక 903, శ్యామల867, నవ్య 829 మార్కులు సాధించారు.

# ఉద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో భారీ నిరసన




- భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన
- ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి పై ఆగ్రహం వ్యక్తం చేసిన జేఏసీ నాయకులు
- ప్రభుత్వం దిగి రాకపోతే ఉద్యమం తప్పదు

**నేటి సాక్షి,కరీంనగర్:** తెలంగాణ రాష్ట్ర ఉద్యోగుల జేఏసీ పిలుపు మేరకు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం ఈ రోజు కరీంనగర్ జిల్లా కేంద్రంలోని స్థానిక కలెక్టరేట్ ఆవరణలో భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి భారీ నిరసన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, గెజిటెడ్ అధికారులు, పెన్షనర్లు, డ్రైవర్లు ఒకే వేదికపై చేరి తమ ఆవేదనను గట్టిగా వ్యక్తం చేశారు. జిల్లా జేఏసీ ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొన్న ఉద్యోగులు ప్రభుత్వ నిర్లక్ష్యంపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. తమ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ. ప్రజల చేత ఏర్పడిన ప్రభుత్వం అమలు చేసే ప్రతి సంక్షేమ పథకాన్ని గ్రామస్థాయికి చేరవేసి, సమర్థవంతంగా అమలు చేసే వారు ప్రభుత్వ ఉద్యోగులేనని, అలాంటి ఉద్యోగుల సంక్షేమాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. అయితే, ఉద్యోగుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, అనేక కీలక సమస్యలు సంవత్సరాలుగా పెండింగ్‌లోనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఆరు నెలలకు ఒకసారి ఇవ్వాల్సిన డిఏలు, సంవత్సరానికి ఒకసారి ఇంక్రిమెంట్లు, ఐదు సంవత్సరాలకు ఒకసారి పీఆర్సీ అమలు చేయడం వంటి హక్కులను కాలానుగుణంగా అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. 01/07/2023 నుండి అమలు చేయాల్సిన పీఆర్సీ ఇప్పటికీ అమలు కాలేదని, ఇప్పటివరకు దాదాపుగా మూడు సంవత్సరాలు అయినప్పటికీ గత ప్రభుత్వం ఇచ్చిన కేవలం 5% ఇంటరియమ్ రిలీఫ్‌తో సరిపెట్టడం జరిగిందని తెలిపారు. అలాగే 2024 జూలై నుండి 2026 జనవరి వరకు రావాల్సిన ఐదు డిఏలను పెండింగ్‌లో ఉంచడం తగదు అని హితవు పలికారు అదేవిధంగా, ఉద్యోగుల జిపిఎఫ్ డబ్బులు, సరెండర్ లీవ్ బిల్లులు, టీజీఎల్ఐఎఫ్ ఇన్సూరెన్స్ బిల్లులు, వివిధ రకాల ఏరియర్స్ సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉంచడం వల్ల ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఓపిఎస్ పునరుద్ధరణపై ఇచ్చిన హామీని ప్రభుత్వం నెరవేర్చలేదని, కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేయడంలో ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. అలాగే హెల్త్ కార్డు పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయడంలో కూడా ప్రభుత్వం విఫలమైందని, ఎంపానెల్డ్ హాస్పిటల్స్‌ను ఫైనలైజ్ చేయకపోవడం వల్ల ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌లో జాప్యం జరుగుతుండటం పట్ల కూడా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. 30-35 సంవత్సరాల పాటు కష్టపడి సంపాదించిన తమ సొంత డబ్బులను కూడా పొందేందుకు ఉద్యోగులు ఈరోజు ధర్నాలు చేయాల్సిన పరిస్థితి రావడం దౌర్భాగ్యకరమని అన్నారు. తమ పిల్లల భవిష్యత్తు, ఆరోగ్య అవసరాలు, ఇళ్ల నిర్మాణం కోసం దాచుకున్న డబ్బులను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగులందరూ ఈ రోజు ఒకే స్వరంతో తమ నిరసనను వ్యక్తం చేస్తున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని జేఏసీ నాయకులు గట్టిగా డిమాండ్ చేశారు. అదేవిధంగా ఈరోజు గౌరవ జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా గారిని జేఏసీ నాయకులు దారం శ్రీనివాస్ రెడ్డి, మడి పెల్లి కాళీ చరణ్, అయిలేని కరుణాకర్ రెడ్డి, మర్రి జయపాల్ రెడ్డి, పిన్నింటి తిరుపతిరావు,కోట శ్యామ్, గోనె శ్రీనివాస్ కేతిరి తిరుపతిరెడ్డి,కటకం రమేష్ , అశోక్ రావు,రాగంపేట చంద్రశేఖర రావు, పెన్షనర్ల జేఏసీ జిల్లా అధ్యక్షులు ఉస్మాన్ పాషా ప్రధాన కార్యదర్శి జాలీ మహేందర్ రెడ్డి తదితరులు రిప్రజెంటేషన్ ఇవ్వడం జరిగింది దానికి అనుగుణంగా గౌరవ కలెక్టర్ గారు స్పందిస్తూ అట్టి రిప్రజెంటేషన్ ప్రభుత్వానికి పంపిస్తానని హామీ ఇవ్వడం జరిగింది

# మద్యం మత్తులో డ్రైవింగ్ చేస్తే జైలుకే



- డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలో : సీఐ

**నేటి సాక్షి, ఎండపల్లి:** మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తప్పవని ధర్మపురి సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎ.రాం నర్సింహారెడ్డి హెచ్చరించారు. వెల్గటూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాజారాంపల్లి చౌరస్తాలో ఆయన ఆధ్వర్యంలో సబ్ ఇన్స్పెక్టర్ పి.ఉదయ్ కుమార్ మరియు సిబ్బంది గురువారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేపట్టి పలువురు వాహనదారులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మద్యం మత్తులో వాహనం నడపడం చట్ట విరుద్ధమని, అటువంటి వారిపై కేసులు నమోదు చేసి జైలు శిక్ష విధించే అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. వాహనదారులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, వాహన పత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం తప్పనిసరి అని, మైనర్లు వాహనాలు నడిపితే వారి తల్లిదండ్రులపై కూడా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, నియమాలు పాటిస్తేనే ప్రమాదాలను నివారించవచ్చని ఆయన తెలిపారు.

# డంపింగ్ యార్డ్ వద్దు మా గ్రామాన్ని కాపాడండి



- కమ్మేట గ్రామస్తుల ఆవేదన
- కమ్మెట సర్పంచ్ ముంద్రిక పద్మమ్మ కృష్ణ గౌడ్ గ్రామ ప్రజల మాజీ సర్పంచ్ అనుమంత్ రెడ్డి ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు ప్రారంభించినారు
- కమ్మేటలో డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా ఉధృతమైన ఆందోళనలు

**నేటి సాక్షి చేవెళ్ల (సుధాకర్ గౌడ్):** చేవెళ్ల మండల పరిధిలోని కమ్మేట గ్రామంలో ప్రతిపాదించిన డంపింగ్ యార్డ్‌పై గ్రామస్తుల నిరసనలు మరింత ఉధృతమయ్యాయి. సర్వే నంబర్ 222లో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయాలని తెలిసిన నేపథ్యంలో గ్రామ ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.గ్రామంలో చిన్నా పెద్దలు తేడా లేకుండా యువకులు, గ్రామస్తులు అందరూ ఏకమై ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నారు.గత వారం రోజులుగా కలెక్టర్, ఆర్డీవో, ఎమ్మార్వోలను కలిసి వినతి పత్రాలు సమర్పిస్తూ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.రిలే నిరాహార దీక్షలు ప్రారంభించినారు డంపింగ్ యార్డ్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు శుక్రవారం నుంచి రిలే నిరాహార దీక్షలు చేపట్టారు.ఈ క్రమంలో అధికారులు ఆర్డీవో ఎమ్మార్వో గ్రామ ప్రజలు వెళ్లి కలవగా స్పందించి, డంపింగ్ యార్డ్‌ను మరో ప్రాంతానికి మార్చే అంశాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిసింది.ఆరోగ్య సమస్యలపై భయం డంపింగ్ యార్డ్ వల్ల గ్రామంతో పాటు పరిసర గ్రామాల్లో కాలుష్యం, దుర్వాసన, అనారోగ్య సమస్యలు వస్తాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.అందుకే చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కూడా పెద్ద సంఖ్యలో మద్దతు తెలిపారు గొల్లగూడెం గ్రామ సర్పంచ్ ఉప సర్పంచ్ గ్రామస్తులు మద్దతు తెలిపారు డంపింగ్ యార్డ్ ప్రతిపాదనను పూర్తిగా రద్దు చేయాలని గ్రామస్తులు స్పష్టం చేశారు. సమస్య పరిష్కారం వరకు తమ ఆందోళనలు కొనసాగుతాయని గ్రామ ఉపసర్పంచ్ విష్ణు గౌడ్ వార్డు మెంబర్లు గ్రామ ప్రజలు యువకులు పెద్దలు హెచ్చరించారు.

# జగిత్యాల సభను విజయవంతం చేయాలి





- కేసీఆర్ సభకు భారీ జన సమీకరణే లక్ష్యం

**నేటి సాక్షి, జగిత్యాల(గుండ ప్రశాంత్ గౌడ్ ):** ఈ నెల 20వ తేదీన జగిత్యాలలో జరుగబోయే భారీ బహిరంగ సభకు తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రానున్న నేపథ్యంలో సభకు గొల్లపల్లి నుండి భారీ ఎత్తున పార్టీ శ్రేణులు ప్రజలను తరలించేందుకు ప్రణాళిక సిద్ధం చేసేందుకు శుక్రవారం ధర్మపురి నియోజకవర్గ ఇంచార్జ్ ఎమ్మెల్సీ రవీందర్ రావు అధ్యక్షతన ముఖ్య నాయకులతో గొల్లపల్లి మండల కేంద్రంలో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. నాయకులకు పలు సూచనలు సలహాలు ఇచ్చి దిశానిర్దేశం చేశారు.సభకు ఏ గ్రామం నుండి ఎంత మంది తరలివస్తున్నారు.. రానున్నారు.వారికోసం రవాణా బోజన సదుపాయాల నిర్వహణ ఏవిధంగా చేయాలనే విషయాలను కూలంకషంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రవీందర్ రావు.మాట్లాడుతూ తెలంగాణ తొలి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జగిత్యాలకు రానున్న సందర్భంగా బారస కార్యకర్తలే కాకుండా ప్రజలు స్వచ్ఛందంగా సభకు తరలి రావడానికి సిద్ధంగా ఉన్నారన్నారు.జగిత్యాల సభను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు మాజీ సర్పంచ్ లు మాజీ ఎంపీటీసీ లు మరియు మహిళా నాయకులు మండల కార్యకర్తలు పాల్గొన్నారు

# అర్హులందరికీ సదరం సర్టిఫికెట్లు అందేలా చూడాలి

## అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్



**నేటి సాక్షి,వికారాబాద్ :** జిల్లాలో సదరం సర్టిఫికెట్లకు అర్హులైన వారందరికీ అవి అందేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఉమా శంకర్ ప్రసాద్ ఆదేశించారు. శుక్రవారం తన ఛాంబర్‌లో సదరం క్యాంపుల నిర్వహణ, యుడిఐడి (UDID) పోర్టల్‌లో దరఖాస్తుల అప్‌లోడింగ్ ప్రక్రియపై డిపిఎం, ఏపీఎంలతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సదరం సర్టిఫికెట్ కొరకు వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని అధికారులకు సూచించారు. క్యాంపుల కోసం ఎక్కువ మంది దరఖాస్తు చేసుకుంటున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో తక్కువ మంది హాజరవుతున్నట్లు గుర్తించామని, ఈ విషయంలో అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని అన్నారు. స్లాట్ బుక్ చేసుకున్న ప్రతి ఒక్కరికీ ముందస్తు సమాచారం అందించి, వారు క్యాంపునకు హాజరయ్యేలా చూడాలన్నారు. అలాగే డిఆర్డిఏ ద్వారా అమలవుతున్న వివిధ సంక్షేమ కార్యక్రమాల పురోగతిపై ఆయన ఆరా తీశారు. ఈ సమీక్షా సమావేశంలో డిఆర్డిఏ పీడీ శ్రీనివాస్, డిప్యూటీ డిఆర్డిఏ నర్సింలు, డిపిఎం మహేష్, ఏపిఎంలు తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారిపై యాజమాని పైశాచికత్వం





- ఏడేళ్ల బాలికను బాతుల కాపరిగా మార్చిన వైనం

**నేటి సాక్షి,కోదాడ,అనంతగిరి:** ఏడేళ్ల చిన్నారిని బాతుల కాపరిగా మార్చి, ఇంట్లో వెట్టిచాకిరి చేయిస్తూ చిత్రహింసలకు గురిచేస్తున్న యాజమానిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతగిరి ఏఎస్ఐ లింగారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని పాలవరం గ్రామ శివారు చెరువు వద్ద కోదాడకు చెందిన పాలకుర్తి శ్రీకాంత్ అనే వ్యక్తి సుబ్బులు (7) అనే బాలికను గత నాలుగేళ్లుగా బానిసగా మార్చుకున్నాడు. బాలిక తల్లిదండ్రులు నాలుగేళ్ల క్రితం శ్రీకాంత్ వద్ద వదిలి వెళ్లగా, అప్పటి నుండి ఆ చిన్నారిని ఇంట్లో పనులు చేయిస్తూ, బాతుల వద్ద కాపలా ఉంచుతున్నాడు. నిత్యం ఎండలో ఆకలితో అలమటిస్తూ చెరువు గట్టున ఒంటరిగా ఉంటున్న బాలికను గమనించిన స్థానికులు చైల్డ్ లైన్ 1098కు సమాచారం అందించారు. రంగంలోకి దిగిన చైల్డ్ డెవలప్మెంట్ అధికారులు బాలికను రక్షించి పోలీసుల వద్దకు తీసుకువచ్చారు. చైల్డ్ ఆఫీసర్ నిమ్మగడ్డ శేషారత్నం, కోదాడ సహాయక కార్మిక అధికారి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టగా.. పనిచేయకపోతే శ్రీకాంత్ విచక్షణారహితంగా కొడుతూ చిత్రహింసలు పెడుతున్నాడని బాలిక రోదిస్తూ వివరించింది. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు. చిన్నారిపై జరిగిన ఈ అమానుషంపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున నిరసన వ్యక్తమవుతోంది.

# అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి టీడీపీ అండ



**నేటి సాక్షి ,** పెద్దకడబూరు మండలంలో జరిగిన అగ్ని ప్రమాదంలో గుడిసె పూర్తిగా దగ్ధమై నిరాశ్రయులైన జల్లి చిన్న ఆంజనేయ కుటుంబానికి మంత్రాలయం టీడీపీ ఇంచార్జి ఎన్. రాఘవేందర్ రెడ్డి అండగా నిలిచారు. ప్రమాదంతో అన్నీ కోల్పోయిన కుటుంబాన్ని స్వయంగా పరామర్శించిన ఆయన, వారి పరిస్థితిని తెలుసుకుని ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి తక్షణ సహాయంగా రూ.10,000 ఆర్థిక సాయం అందజేయడంతో పాటు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఇలాంటి కష్టకాలంలో తమకు ఎప్పుడూ అండగా ఉంటామని, కుటుంబాన్ని ఒంటరిగా వదిలిపెట్టమని భరోసా ఇచ్చారు. బాధితులు తిరిగి సాధారణ జీవితం ప్రారంభించేందుకు అవసరమైన సహాయాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సహాయక కార్యక్రమంలో మంచాల సొసైటీ చైర్మన్ ఎన్. రామకృష్ణ రెడ్డి, టీడీపీ యువనాయకులు ఎన్. రాకేష్ రెడ్డి ముందుండి సేవలందించారు. అలాగే మండల జనరల్ సెక్రటరీ ఎం. రామాంజనేయులు, పెద్దకడబూరు సొసైటీ చైర్మన్ టి. ఆంజనేయులు, రాష్ట్ర సాధికార కమిటీ సభ్యులు మల్లికార్జున, యూనిట్ ఇంచార్జ్ తలారి అంజి, డీలర్ ఈరన్న, టి. లక్ష్మన్న, యువరాజ్, టి. ఈరన్న, ఓబులేసు, చిన్న హనుమన్న, కె. వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. అనుకోని ప్రమాదంతో ఇల్లు కోల్పోయిన కుటుంబానికి నాయకులు తక్షణ సహాయం అందించడం ద్వారా మానవత్వాన్ని చాటారని స్థానికులు అభినందించారు.

# డిజిటల్ జనగణనకు సహకరించండి

## ఎంఆర్ఓ వలిబాషా



**నేటి సాక్షి పెద్దకడబూరు:** దేశంలో తొలిసారిగా డిజిటల్ విధానంలో నిర్వహించనున్న 'జనగణన-2027'లో భాగంగా ప్రవేశపెట్టిన 'సెల్ఫ్ ఎన్యూమరేషన్' (స్వయం నమోదు) విధానాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని పెద్దకడబూరు ఎంఆర్ఓ వలిబాషా సూచించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈ నూతన విధానం ద్వారా ప్రతి కుటుంబం తమ వివరాలను స్వయంగా మొబైల్ లేదా కంప్యూటర్ ద్వారా నమోదు చేసుకునే వెసులుబాటు ఉందని తెలిపారు. అధికారిక వెబ్‌సైట్ www.ఒవ.ఎవఅంబం.స్త్రశీజ.అఅ ద్వారా ప్రజలు తమ ఇంటి వివరాలను సులభంగా నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. వెబ్‌సైట్‌లో నమోదు ప్రక్రియ పూర్తయిన తర్వాత లభించే SE ID (సెల్ఫ్ ఎన్యూమరేషన్ ఐడీ)ని తప్పనిసరిగా భద్రపరుచుకోవాలని, భవిష్యత్తులో ఎన్యూమరేటర్లు వచ్చినప్పుడు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని వివరించారు. ఈ డిజిటల్ ప్రక్రియలో ప్రజలు భాగస్వాములై జనగణనను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# అగ్ని బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి భరోసా



**నేటి సాక్షి,పెద్దకడబూరు :** మండలంలోని లక్ష్మీపేట గ్రామంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన చిన్న ఆంజనేయ కుటుంబాన్ని మంత్రాలయం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి ఫోన్ ద్వారా పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ ప్రమాదంలో గుడిసె పూర్తిగా దగ్ధమై ఆ కుటుంబం నిరాశ్రయులుగా మారిన విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే స్పందించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు వైఎస్సార్సీపీ మండల నాయకులు రామ్మోహన్ రెడ్డి, చంద్రారెడ్డి, శివారెడ్డి, విజేంద్ర రెడ్డి శుక్రవారం బాధిత కుటుంబాన్ని స్వయంగా కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా వారికి తక్షణ ఆర్థిక సాయంతో పాటు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ప్రభుత్వం తరపున మరియు వ్యక్తిగతంగా ఆ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని నాయకులు హామీ ఇచ్చారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలో ఎమ్మెల్యే ఎప్పుడూ ముందుంటారని వారు పేర్కొన్నారు.

TGTEL/25/A1737 | NETI SAKSHI

# “నో హెల్మెట్ నో ఎంట్రీ”

## రేపాల గ్రామంలో వినూత్న నిర్ణయం...




**నేటి సాక్షి, మునగాల:** రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల ప్రాణాలను కాపాడేందుకు మునగాల మండల పరిధిలోని రేపాల గ్రామంలో వినూత్న కార్యక్రమం చేపట్టారు. గ్రామ సర్పంచ్ మొగిలిచర్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో “నో హెల్మెట్ – నో ఎంట్రీ” అనే ప్రత్యేక ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమం ప్రకారం గ్రామంలోకి వచ్చే ప్రతి ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి. హెల్మెట్ లేకుండా గ్రామంలోకి ప్రవేశించకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఈ నిర్ణయం గ్రామంలోనే కాకుండా పరిసర ప్రాంతాల్లో కూడా చర్చనీయాంశమైంది. గ్రామంలోని ప్రధాన కూడళ్లలో బ్యానర్లు, పోస్టర్లు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. “హెల్మెట్ పెట్టుకోండి – ప్రాణాన్ని కాపాడుకోండి” అనే నినాదంతో ప్రచారం కొనసాగిస్తున్నారు. యువత, మహిళలు కూడా ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొంటున్నారు. ఇటీవలి కాలంలో హెల్మెట్ లేకుండా ప్రయాణించడం వల్ల ప్రమాదాలు పెరుగుతున్నాయని గమనించిన సర్పంచ్ ఈ నిర్ణయం తీసుకున్నారు. చిన్న నిర్లక్ష్యం పెద్ద ప్రమాదాలకు దారి తీస్తుందని, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. గ్రామ ప్రజల ప్రాణ భద్రతే మా మొదటి ప్రాధాన్యత. అభివృద్ధితో పాటు భద్రతకూ ప్రాముఖ్యత ఇస్తున్నాం. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించడం అలవాటు చేసుకుంటే అనేక ప్రమాదాలు నివారించవచ్చు. రేపాల గ్రామంలో అమలు చేస్తున్న ఈ వినూత్న కార్యక్రమం ఇతర గ్రామాలకు కూడా ఆదర్శంగా నిలుస్తోంది. ప్రజలు ఈ చర్యను అభినందిస్తున్నారు.

# ఫలితాల ఒత్తిడితో విద్యార్థిని బలి

## కోదాడ ఎస్ఆర్ఎస్ కాలేజీలో కలకలం



**నేటి సాక్షి.కోదాడ :** ఇంటర్ ఫలితాల ఒత్తిడి మరో నిండు ప్రాణాన్ని బలితీసుకుంది. సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలోని ఎస్ఆర్ఎస్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న బొగ్గారపు లేక్ష (16) శుక్రవారం హాస్టల్ గదిలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మేళ్లచెరువు గ్రామానికి చెందిన లేక్ష ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాల్లో ఫెయిల్ కావడంతో తీవ్ర మనస్థాపానికి గురైనట్లు తెలుస్తోంది. సప్లమెంటరీ పరీక్షలకు సిద్ధం కావాలనే ఉద్దేశంతో కళాశాలకు వచ్చిన రోజే ఈ దారుణానికి ఒడిగట్టింది. హాస్టల్ గదిలో ఫ్యానుకు చున్నీతో ఉరేసుకోగా గమనించిన తోటి విద్యార్థులు వెంటనే ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ లేక్ష మృతి చెందింది. ఈ ఘటనతో ఆమె తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే తమ కూతురు మరణించిందని వారు ఆరోపిస్తున్నారు. హాస్టల్లో సరైన పర్యవేక్షణ లేకపోవడం, విద్యార్థుల మానసిక స్థితిని పట్టించుకోకపోవడం వల్లే ఈ అఘాయిత్యం జరిగిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పరీక్షల ఫలితాల నేపథ్యంలో విద్యాసంస్థలు విద్యార్థులకు ప్రత్యేక కౌన్సిలింగ్ ఇవ్వాలని విద్యావేత్తలు కోరుతున్నారు.

# క్షేమంగా చేరడమే లక్ష్యం కావాలి..

## ‘అరైవ్ అలైవ్’లో డీజీపీ శివధర్ రెడ్డి



**నేటి సాక్షి,గజ్వేల్ :** రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా మానవ తప్పిదాల వల్లే జరుగుతున్నాయని, ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ బాధ్యతగా వ్యవహరించాలని తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి పిలుపునిచ్చారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని మహతి ఆడిటోరియంలో నిర్వహించిన “అరైవ్ అలైవ్” రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ హైమావతి, పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్‌లతో కలిసి ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. వాహనాలను ఎడమ వైపు నుంచి ఓవర్‌టేక్ చేయడం అత్యంత ప్రమాదకరమని, ఎల్లప్పుడూ రోడ్డుకు ఎడమ వైపునే ప్రయాణించాలని సూచించారు. డ్రైవింగ్ చేసేటప్పుడు మన వాహనంతో పాటు ఎదుటివారి కదలికలను కూడా గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఫోర్ వీలర్ వాహనదారులు తప్పనిసరిగా సీట్‌బెల్ట్ ధరించాలని, హైవేలపై ప్రయాణించే వాహనాలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ప్రాణం పోతే తిరిగి రాదని, అతివేగం ప్రాణాంతకమని హెచ్చరించారు. ఆటో డ్రైవర్లు యూనిఫాం ధరించి క్రమశిక్షణతో ఉండటం అభినందనీయమన్నారు. జిల్లా కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ.. జిల్లాలో గత రెండేళ్లలో జరిగిన రోడ్డు ప్రమాదాల గణాంకాలను వివరించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని సూచించారు. పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనం నడిపి ప్రమాదం చేయడం హత్యతో సమానమని మండిపడ్డారు. కుటుంబ పెద్ద మరణిస్తే ఆ ఇల్లు రోడ్డున పడుతుందని, అందుకే క్షేమంగా ఇంటికి చేరడమే లక్ష్యంగా ప్రయాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ ఆయేషా ఫాతిమా, ఇతర అధికారులు, పెద్ద సంఖ్యలో వాహనదారులు పాల్గొన్నారు.

# సూర్యాపేట సబ్ జైలులో డీజీ సౌమ్య మిశ్రా ఆకస్మిక తనిఖీ



- ఎంపీడీవో అనుమల్ల వాసవి
- ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి:తహసిల్దార్ భూమేశ్వర్
- 99 రోజుల యాక్షన్ ప్లాన్ విజయవంతం

**నేటి సాక్షిసూర్యాపేట:** సూర్యాపేట సబ్ జైలును తెలంగాణ రాష్ట్ర కారాగార శాఖ డైరెక్టర్ జనరల్ (DG) డాక్టర్ సౌమ్య మిశ్రా శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జైలులోని బ్యారెక్టులు, వంటశాల, భద్రతా వ్యవస్థలను ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు. ఖైదీలకు అందిస్తున్న ఆహార నాణ్యత, వైద్య సదుపాయాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఖైదీలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్న ఆమె, అనారోగ్యంతో ఉన్న వారికి మెరుగైన వైద్యం అందించాలని, మందులను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. జైలు పరిపాలనలో పూర్తి పారదర్శకత ఉండాలని, భద్రత విషయంలో ఎటువంటి నిర్లక్ష్యం వహించకూడదని అధికారులకు స్పష్టం చేశారు. సీసీ కెమెరాల నిఘా నిరంతరం ఉండాలని, ఖైదీల పట్ల మానవీయ దృక్పథంతో వ్యవహరిస్తూనే క్రమశిక్షణ పాటించేలా చూడాలన్నారు. ఖైదీల్లో పరివర్తన తెచ్చేందుకు పునరావాస కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ తనిఖీలో హైదరాబాద్ రేంజ్ డీఐజీ డా. డి. శ్రీనివాస్, నల్గొండ డీఎస్‌జేఆర్ శోభన్ బాబు, జైలు సూపరింటెండెంట్ బి. సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరాంసాగర్ కాల్వపై నిర్లక్ష్యం..ఎండిన పంటలు



**నేటి సాక్షి,మునగాల :** శ్రీరాంసాగర్ రెండో దశ కాల్వపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించి, చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లు నాగార్జున రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం మునగాల మండల కేంద్రంలో చందా చంద్రయ్య అధ్యక్షతన నిర్వహించిన రైతు సంఘం మండల మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సాగునీరు సక్రమంగా అందక ఈ వేసవిలో వరి పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించి, వెంటనే నగదు జమ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. యూరియా యాప్ విధానాన్ని రద్దు చేయాలని, రైతు భరోసా పెట్టుబడి సాయాన్ని సకాలంలో అందించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాల వల్ల ఎరువులు, మందుల ధరలు పెరిగి వ్యవసాయం భారంగా మారిందని విమర్శించారు. రైతాంగ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 19న నిమ్మికల్‌లో జరిగే జిల్లా మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం రైతు సంఘం మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చందా చంద్రయ్య, కార్యదర్శిగా దేశిరెడ్డి స్టాలిన్ రెడ్డి ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సిపిఐఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొలిశెట్టి యాదగిరిరావు, బుర్రి శ్రీరాములు, షేక్ సైదా, జూలకంటి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# దేశవ్యాప్తంగా కులగణన చర్చకు దారి

## తీన్మార్ మల్లన్నకు ఘన గౌరవం

- సూర్యాపేటలో TRP ఆధ్వర్యంలో భారీ కార్యక్రమం మల్లన్న ఫోటోకు పాలాభిషేకం..





**నేటి సాక్షి, సూర్యాపేట:** సూర్యాపేట జిల్లా కేంద్రంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ (TRP) ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమం రాజకీయంగా, సామాజికంగా ప్రత్యేక ప్రాధాన్యం సంతరించుకుంది. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టె జానయ్య యాదవ్ నాయకత్వంలో జరిగిన ఈ సభలో కులగణన అంశంపై బలమైన సందేశం వినిపించింది. దేశవ్యాప్తంగా కులగణన అంశాన్ని చర్చలోకి తీసుకువచ్చిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు ఘనంగా సత్కారం నిర్వహించారు. అభిమానంతో ఆయన ఫోటోకు పాలాభిషేకం చేస్తూ నాయకులు, కార్యకర్తలు నినాదాలతో కార్యక్రమాన్ని ఉత్సాహభరితంగా మార్చారు. మల్లన్నపై ఉన్న ప్రజాభిమానానికి ఇది నిదర్శనంగా నిలిచింది. ఈ సందర్భంగా వట్టె జానయ్య యాదవ్ మాట్లాడుతూ – “సమాజంలో నిజమైన సమానత్వం సాధించాలంటే కులగణన తప్పనిసరి. వెనుకబడిన వర్గాల అసలు స్థితి బయటపడాలంటే ఈ ప్రక్రియ అత్యవసరం” అని స్పష్టం చేశారు. కులగణన ఆధారంగా ప్రభుత్వ పథకాలు సరైన లబ్ధిదారులకు చేరుతాయని, సామాజిక న్యాయం బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. అలాగే తీన్మార్ మల్లన్న పోరాటం వల్లే కులగణన అంశం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిందని కొనియాడారు. ఆయన నాయకత్వం సామాజిక న్యాయ సాధనలో కీలక మలుపు తిప్పిందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో TRP మహిళా విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బెల్లంకొండ నీరజ గౌడ్, జిల్లా అధ్యక్షులు మామిడి అంజయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి మీర్ అక్బర్, మహిళా విభాగం అధ్యక్షురాలు కొన్నే మంజుల గౌడ్, మైనార్టీ విభాగం అధ్యక్షుడు చాంద్ పాషా, టౌన్ అధ్యక్షుడు కుంభం నాగరాజు, ఉపాధ్యక్షురాలు వర్రె కవిత, ప్రధాన కార్యదర్శి నారాయణ దాస్, ఆత్మకూరు (ఎస్) మండలాధ్యక్షుడు బొల్లె సైదులు, పెన్‌పహాడ్ మండలాధ్యక్షుడు ఆవుల అంజయ్యతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

